ప్రభుత్వ ఆసుపత్రిలో వసతుల కల్పనకు చర్యలు

ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, మే 13 సిరి న్యూస్:
మెదక్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి రూపురేఖలు మార్చే విధంగా ప్రభుత్వ నిధులతో వసతుల కల్పనకు పటిష్ట చర్యలు చేపడతామని మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కోసం పలు ప్రతిపాదనలకు కమిటీలో ఆమోదం తెలిపారు. ఆసుపత్రిలోని పలు సమస్యలను జిల్లా కలెక్టర్ ఎంపీ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు, శానిటేషన్ లో అవుట్ లేట్ డ్రైనేజీ, ఆసుపత్రిలో కిటికీలకు జాలిమేష్ ఏర్పాటు, కరెంట్ అంతరాయాన్ని దృష్టిలో పెట్టుకుని యుపిఎస్ మంజూరుకు ఆమోదం తెలపడం జరిగింది. ఆసుపత్రిలో డాక్టర్లు, నర్సుల నియామకం పై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలకు అనుగుణంగా మౌలిక సౌకర్యాలు కల్పనకు కమిటీ సభ్యుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ మౌలిక వసతుల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీందర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, జిల్లా ఆసుపత్రి సుపరిండెంట్ డాక్టర్ సునీత, డి.సిహెచ్.ఎస్ శివ దయాల్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రవీందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత వైద్యాధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నార్సింగి, మే 13 సిరి న్యూస్

మండలంలోని జప్తి శివునూర్ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని జప్తి శివునూర్,కాసులాపూర్,శంకాపూర్ గ్రామాలలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏ.ఈ సీ.హెచ్ స్వామి తెలిపారు. బుధవారం ఉదయం 8 గం నుండి మధ్యాహ్నం 12 గం వరకు 33/11 కేవీ జప్తి శివునూర్ విద్యుత్ సబ్ స్టేషన్ లో మంమ్మత్తు పనులు జరుగుతాయని, అందువల్ల విద్యుత్ సరఫరాలో అంత రాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరిం చాలని ఏ.ఈ స్వామి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.ద

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నర్సాపూర్, మే 13 (సిరి న్యూస్)

నర్సాపూర్ మరియు హత్నూర మండలాలకు చెందిన 51 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన మొత్తం రూ 23,87,000 విలువైన చెక్కులను పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడం నా ధ్యేయం అని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ద్వారా సహాయం చేరేలా నిబద్ధతతో పనిచేస్తున్నానన్నారు.

మెదక్‌లో వర్గ పోరు మొదలైనట్టేనా?

ఎవరికి వారే కార్యక్రమాల నిర్వహణ

ఉమ్మడిగా ముందుకు రాని వైనం...

ఎటు పోవాలో తెలియక అయోమయంలో పడుతున్న కార్యకర్తలు..

రామాయంపేట మే 13 (సిరి న్యూస్)

బిఆర్ఎస్ కు కంచుకోట ఉమ్మడి మెదక్ జిల్లా అలాగే మెదక్ నియోజకవర్గం కూడా ఈ పార్టీకి మంచిపట్టున్న నియోజకవర్గం. అయితే ఈ మధ్యకాలంలో మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకుడు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి మధ్య విభేదాలు తలెత్తాయని తెలుస్తోంది. ఏ కార్యక్రమం చేసిన వేరువేరుగా చేయడం పట్ల కార్యకర్తలు కూడా అయోమయంలో పడుతున్నారు. బహిరంగంగా విభేదాలు బయటపడకున్న లోలోపల మాత్రం విభేదాలు ఉన్నాయని వినిపిస్తున్నాయి. ఇప్పటినుండి వచ్చే ఎన్నికల్లో టికెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారనిపలువురి అభిప్రాయం. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే రోహిత్ రావు తనదైన శైలిలో ముందుకు వెళ్లడంతో పాటు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ను కూడా ఘాటుగా విమర్శిస్తున్నారు. ఈ క్రమంలో అనుకున్న విధంగా ఈ ఇద్దరిలో ఎవరు కూడా ఖండించకపోవడం పట్ల కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోహిత్ రావ్ వ్యాఖ్యల పట్ల పార్టీ కార్యకర్త ఒకరు సోషల్ మీడియాలో ఘాటుగా విమర్శించారు. అయితే ఆ కార్యకర్తను పోలీసులు విచక్షణ రహితంగా కొట్టిన కనీసం పట్టించుకోలేదని ఆరోపణలు వస్తున్నాయి. బాధితుడు ఇటీవల కేటీఆర్ ను కలిసి తన బాధను చెప్పుకున్నాడు. కేటీఆర్ సైతం మెదక్ నియోజకవర్గంలో నాయకుల పనితీరు పట్ల సంతృప్తిగా లేదని పలువురి వాదన. ఏది ఏమైనా ఇంటి పోరే కారుకు తిను సవాలుగా మారే ప్రమాదం ఉంది.

చెట్టును ఢీ కొట్టిన బైక్ ..వ్యక్తి మృతి

కౌడిపల్లి మే 14 సిరి న్యూస్

ద్విచక్ర వాహనం చెట్టును ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల పరిధి మహమ్మద్ నగర్ శివారులోని హనుమాన్ టెంపుల్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం మండల రైలాపూర్ గ్రామానికి చెందిన కుర్మా కిష్టయ్య తమ బంధువులు వెల్దుర్తి మండలం దర్పల్లి గ్రామంలో జాతరకు తన భార్య పద్మ తో కలిసి సోమవారం తన బైక్ పై బయలుదేరాడు. తిరిగి మంగళవారం బైక్ పై కిష్టయ్య ఒక్కడే వస్తున్న క్రమంలో మహమ్మద్ నగర్ శివారు హనుమాన్ మందిరం సమీపాన చెట్టుకు ఢీకొని అక్కడకక్కడ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రంజిత్ రెడ్డి సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికితరలించారు. మృతునిఅల్లుడు గొర్రెకంటిషాదుల్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ రెడ్డి తెలిపారు.

మహిళ హత్య కేసును చేదించిన చేగుంట పోలీసులు

చేగుంట మే 13 సిరి న్యూస్ః

చేగుంటలో ఈనెల 7న 44 జాతీయ రహదారిపై గుర్తుతెలియని మహిళను పెట్రోల్ పోసి దహనం చేయగా కేసు నమోదు చేసిన చేగుంట పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం ఆ కేసును చేదించినట్లు చేగుంట ఎస్ఐ జి చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు, మృతురాలు సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల్ బస్వాపూర్ గ్రామానికి చెందిన అంగన్వాడి టీచర్ బేకరి అంజమ్మగా గుర్తించారు. కేసును పుల్కల్ పోలీస్ వారికి బదిలీ చేసినట్టు చేగుంట ఎస్సై శ్రీ చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు,

కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి

సమ్మె వాల్ పోస్టర్ ఆవిష్కరించిన సిఐటియు మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు

నర్సాపూర్ మే 13 (సిరి న్యూస్)

కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని సిఐటియు మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు.మంగళవారం నర్సాపూర్ పట్టణ కేంద్రంలో సమ్మె గోడపత్రిక ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మిక వర్గం సమంశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాలు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్ లను ముందుకు తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2025-2026 బడ్జెట్లో తమ కార్పొరేట్ అనుకూల విధానాలకు అనుకూలంగా కేటాయింపులు చేసిందన్నారు. సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టింది అన్నారు.కార్పొరేట్ల ప్రయోజనాల కోసం 4 లేబర్ కోడ్ లను అమల్లోకి తెస్తున్నారనీ మండిపడ్డారు. 12 గంటల పనిని చట్టబద్ధం చేస్తున్నారని అన్నారు. అందుకే నాలుగు లేబర్ కోడ్ లను తిప్పి కొట్టి కార్మిక చట్టాలను కాపాడుకోవడం కార్మిక వర్గానికి చాలా అవసరమని గుర్తుచేశారు. నేపథ్యంలో 2025 మే 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హన్మంత్, ఖదీర్, శ్రీనివాస్, ప్రభాకర్, సుధాకర్, రవి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.